ప్రజాశక్తి

శనివారం 12, నవంబర్ 2022

5

శ్రీ సత్యసాయి



అమ్మో..వాటర్‌ట్యాంక్ ..!

లేపాక్షి : మండల పరిధిలోని మహాత్మా జ్యోతి బాపూలే పాఠశాల సంక్షేమ బాలుర హాస్టల్‌లోని వాటర్‌ట్యాంక్‌ను చూస్తేనే విద్యార్థులు హడలిపోతున్నారు. ట్యాంకు, పరిసర ప్రాంతాలో పాచి పట్టాయి. కాలుపెడితే జారి పడే ప్రమాదం నెలకొంది. ఇంత అధ్వాన పరిస్థితి ఉన్నా ప్రిన్సిపల్ పట్టించుకోవటం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. ఆరోగ్య వంతమైన నీటిని అందించడంతో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ట్యాంకును, పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



అపరిశుభ్రత నడుమ వాటర్‌ట్యాంక్



రాస్తారోకో చేస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

రైతుకు న్యాయం చేయాలని రాస్తారోకో

సిపిఎం, సిఐటియు నాయకుల అరెస్టు

ప్రజాశక్తి-పెనుకొండ

సోమందేపల్లి మండలం కావేటినాగేపల్లి గ్రామానికి చెందిన రైతు రామయ్య కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం రాస్తారోకో చేశారు. యాదవ సంఘం నాయకులు వీరికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ.. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం కావేటినాగేపల్లి గ్రామానికి చెందిన పేద రైతు రామయ్య కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రామయ్య కుటుంబం పట్ల పోలీసులు, రెవెన్యూ అధికారుల దౌర్జన్యం, నిర్బంధాలు, బలవంతపు భూసేకరణ ఆపాలని, 2013 భూసేకరణ చట్టాన్ని అమలుచేయాలని, సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత మూడు రోజులుగా రామయ్య కుటుంబాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అర్ధరాత్రి ఇంట్లోని సామాన్లను సైతం తరలించి కట్టుబట్టలతో రైతు రామయ్య కుటుంబాన్ని రోడ్డుపాలు చేశారన్నారు. ఒక రైతు కుటుంబాన్ని ఇంతగా ఇబ్బందులకు గురిచేయడం సరైన పద్ధతి కాదన్నారు. హైకోర్టు ఉత్తర్వులను ఏమాత్రం పట్టించుకోకుండా ప్రభుత్వ అధికారులు రాత్రికి రాత్రి స్థలంలో నిర్మాణాలు చేపట్టి తమ



నాయకులను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

కుటుంబాన్ని రోడ్డుపాలు చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు ఉత్తర్వులను చట్టాలను అమలు చేయాల్సిన సబ్‌కలెక్టర్, డీఎస్పీ స్థాయి అధికారులే ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడడం దారుణమన్నారు. రామయ్య కుటుంబానికి న్యాయం చేసేంతవరకు సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం అండగా ఉంటుందన్నారు. న్యాయం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. అనంతరం పోలీసులు బలవంతంగా నిరసనకారులను అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, సోమందేపల్లి సిపిఎం మండల నాయకులు రాజగోపాల్, చాంద్‌బాషా, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు నాగరాజు, బాలస్వామి, బాధిత కుటుంబ సభ్యులు జయమ్మ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇటుకల బట్టీలో సర్కారు సిమెంటు..!

ప్రజాశక్తి-చిలమత్తూరు

ప్రయివేటు ఇటుకలో బట్టీలో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల కోసం వచ్చిన సిమెంట్ బస్తాలు కలకలం రేపాయి. గురువారం కర్నాటక రాష్ట్రం బాగేపల్లిలో ప్రభుత్వ సిమెంట్ బస్తాలు దర్శనమిచ్చి కలకలం రేపిన ఘటన మరవక ముందే.. శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం కోడూరు పంచాయతీ తుమ్మలకుంట నేషనల్ హైవే సమీపంలోని సిమెంట్ ఇటుకల బట్టీలో ప్రభుత్వ సిమెంట్ బస్తాలు ఇటుకల తయారీలకి వినియోగిస్తూ పాత్రికేయుల కంటబడ్డాయి. పక్కనే ఉన్న షెడ్‌లో వందల సిమెంట్ బస్తాలు డంప్ చేసి ఉన్నాయి. సిమెంట్‌ను ఉపయోగించడం ఫొటో తీసుకోగా గమనించిన నిర్వాహకులు అలర్ట్ అయ్యారు. ఈ విషయంపై ప్రజాశక్తి మండల పరిషత్ అధికారిని వివరణ కోరగా సంబందిత అధికారులను పంపుతామని చెప్పారు. మండల ఇంజినీర్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకునే సరికి షెడ్‌లో ఉన్న సిమెంట్ మాయం చేసినట్లు తెలుస్తోంది. అవి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు వచ్చిన బస్తాలే అని.. అయితే.. గడ్డకట్టడంతో తీసుకొచ్చి వాడుకుంటున్నామని సంబంధిత సిమెంట్ బట్టీ నిర్వాహకులు చెప్పినట్లు స్వయానా మండల ఇంజినీర్ సెలవిచ్చారు.

అక్రమార్కుల తానా..అధికారుల తందానా..

సిమెంట్ పట్టుబడిన ప్రతిసారి అది మండలంలోని సిమెంట్ కాదు అని, లేక గడ్డకట్టడంతోనే వేరే పనులకు వాడుకుంటున్నామని కల్లబొల్లి మాటలు చెప్పడం పరిపాటిగా మారింది. దీనికి అధికారులు సైతం తానా అంటే.. తందాన

చిలమత్తూరు మండలం కోడూరు పంచాయతీకి వచ్చిన సిమెంట్‌గా గుర్తింపు

గడ్డకట్టిన సిమెంట్ ఇచ్చి ఇటుకలు తీసుకుంటున్నామన్న సర్పంచి

అన్న చందంగా మారారు. వాస్తవంగా గడ్డకడితే ఏ పనికీ ఉపయోగపడదు. ఇటుకల తయారీకి మాత్రం ఎలా ఉపయోగపడిందన్నది ప్రశ్న. ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాల కోసం ఇచ్చే సిమెంట్‌ను కర్నాటక రాష్ట్రానికి తరలించడం.. లేదా ప్రయివేటు వాటికి అమ్ముకోవడం.. తర్వాత ఆ సంచులు తెచ్చి ఇప్పటివరకు నిర్మించిన రోడ్లకు, భవనాలకు వాడుకున్నట్లు లెక్కలు రాయించుకోవడం నిత్యకృత్యం

ఎక్కువ కాలం నిలువవుంచితే గడ్డకడుతుంది

మురళి, కోడూరు గ్రామ సర్పంచి

ఈ విశయంపై కోడూరు గ్రామ సర్పంచి మురళీని వివరణ కోరగా.. సిమెంట్‌ను ఎక్కువ కాలం నిలువవుంచితే గడ్డకడుతుంది. అసలే వర్షాకాలం. కొద్దిగా గడ్డలుకట్టగానే బట్టీవారికి ఇచ్చాం. అలాగే వదిలేస్తే వృథా అవుతుంది. బట్టీ వారు దానికి బదులు ఇటుకలు ఇస్తారు. కామన్ సర్వీస్ సెంటర్ వేగవంతం చేయాలని ఒత్తిడి ఉండటంతో వాటి నిర్మాణానికి బట్టీ వారి నుండి ఇటుకలు తీసుకుంటున్నాం. సక్రమంగా ఉన్న సిమెంట్‌ను రోడ్డు వేయడానికి ఉపయోగిస్తున్నాం. నాడునేడు పనులకు కూడా ఈ సిమెంట్ వాడుకుంటున్నారు. ఏదైనా ప్రభుత్వ కార్యక్రమమే కదా. అందుకే సహకరిస్తున్నాం.



బట్టీలో ఇటుకలు వేయడానికి ఉపయోగిస్తున్న ప్రభుత్వ సిమెంట్

అయిందన్న విమర్శలు చిలమత్తూరు మండలంలో జోరందుకున్నాయి. ఇందుకు కొంతమంది స్థానిక ప్రజా ప్రతినిధులతో పాటు అధికారులు కూడా సహకరిస్తున్నట్లు తెలుస్తుంది. లేకుంటే ఇప్పటి వరకు ఎంత పని జరిగింది ? జరిగిన పనికి ఎన్ని బస్తాల సిమెంట్ ఉపయోగించారు ? ఇంక ఎంత నిల్వవుంది?.. అన్న సమాచారం స్థానిక సచివాలయం ఇంజినీర్ల వద్ద ఉంటుంది. వారి కళ్ళుగప్పి సిమెంట్ ఇలా తరలించడం కుదరదు. దీంతో వారి సహకారం కూడా ఉందన్న అనుమానం కలగక మానదు.

ఇటుకల బట్టీల్లో దర్శనమిచ్చిన సిమెంట్ ఎవరిది?

ప్రయివేటు ఇటుక బట్టీల్లో దర్శనమిచ్చిన ఈ సిమెంట్ కోడూరు పంచాయతీలోని సిమెంట్ అని తెలిసింది. రోడ్లు వేయడానికి ఇచ్చిన సిమెంట్‌గా ఇంజినీర్లు గుర్తించారని తెలుస్తోంది. అయితే ఈ సిమెంట్ మొత్తం కోడూరు సర్పంచి ఆదీనంలో ఉందని ఇంజినీర్లు తెలిపారు. గడ్డకట్టడం వల్లే ఇటుకల బట్టీ వారికి ఇచ్చినట్లు సమాధానం ఇస్తున్నారు. గడ్డకట్టిన సిమెంట్ ఇటుక వేయడానికి ఎలా ఉపయోగపడుతుందన్నది ప్రశ్నార్థంగా మారింది.

మోడీ ఆంధ్రుల ద్రోహి : సిపిఎం

ప్రజాశక్తి కదిరి టౌన్

ఆంధ్రప్రదేశ్‌కు మోసం చేసిన ఆంధ్రుల ద్రోహి ప్రధాని మోడీ గో బ్యాక్ అంటూ సిపిఎం సిపిఐ నాయకులు నినాదాలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశాఖపట్నం పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. విభజన చట్టంలోని హామీలను అమలుపరచి రాష్ట్రంలోకి అడుగు పెట్టాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నం లో ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన నిరసిస్తూ వామపక్ష పార్టీల రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కదిరి పట్టణంలో వేమారెడ్డి సర్కిల్‌లో సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలకు మోసం చేసిందని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విభజన హామీలు అమలు చేయకుండా ప్రజలను నట్టేట ముంచారని విమర్శించారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, వెనుకబడిన ఉత్తరాంధ్ర , రాయలసీమలకు ప్రత్యేక ప్యాకేజీ , కడపకు స్టీలు ఫ్యాక్టరీ, విశాఖ కు రైల్వే జోన్, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు హామీలను అమలు చేయాలనాక్నరు.

ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ పర్యటనను వ్యతిరేకిస్తూ నిరసన

రాజధానికి , పోలవరం నిర్మాణానికి నిధులు మంజూరు చేయకుండా నరేంద్ర మోడీ రాష్ట్రంలోకి అడుగుపెడితే వామపక్ష పార్టీలుగా చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. విభజన చట్టంలోని హామీలను నెరవేర్చిన తర్వాతే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి అడుగు పెట్టాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలను నయవంచన చేసిన మోడీకి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విశాఖపట్నంలో ఇళ్లను కూల్చి ఆయన పర్యటన ఏర్పాట్లు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. విశాఖ ఉక్కును ప్రయివేటు వ్యక్తులకు దారాదత్తం చేయడానికి మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకు అప్పజెప్పి భారత సంపదను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. కేంద్రంలో ఉన్న బిజెపికి రాష్ట్రంలో ఉన్న వైసిపికి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. ఇప్పటికైనా విభజన చట్టంలోని హామీలను నెరవేర్చాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం



కదిరి పట్టణంలో నిరసన తెలుపుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు

జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి, సిఐటియు కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, నియోజకవర్గ కార్యదర్శి కదిరప్ప, సిపిఎం పట్టణ కార్యదర్శి నరసింహులు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు మధు నాయక్, ఎఐకెఎస్ఎ రైతుసంఘం నియోజకవర్గ కార్యదర్శి మధుసూదన, సిపిఐ పట్టణ కార్యదర్శి లియాకత్, నాయకులు మనోహర్, ముబారక్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నల్లజోడు పవన్, ఉపేంద్ర, శేషం మహేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబ్జాన్, సిపిఎం నాయకులు హరినాథ్ రెడ్డి, సిపిఐ సిపిఎం నాయకులు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, సభ్యులు, అధికారులు

గ్రేట్ - 2 మున్సిపాలిటీగా మార్పు కోసం కౌన్సిల్ తీర్మానం

ప్రజాశక్తి పుట్టపర్తిఅర్బన్

పుట్టపర్తి నగర పంచాయతీని గ్రేట్ 2 మున్సిపాలిటీగా మార్పు చేయడానికి కౌన్సిల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. చైర్మన్ తుంగ ఓబుళపతి అధ్యక్షతన శుక్రవారం జరిగిన అత్యవసర సమావేశంలో ముఖ్యఅతిథిగా శాసనసభ్యుడు దద్దుకుంట శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టపర్తి నగర పంచాయతీలో జనాభా పెరిగిందని, అందుకు తగ్గట్టుగా అవసరాలు పెరిగాయని, ఆర్థిక వనరులు కూడా పెంచుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. అందుకు గ్రేట్ 2 మున్సిపాలిటీగా రూపాంతరం చెందితే ప్రభుత్వం నుంచి ఆర్థిక వనరులు అధికంగా పొందే అవకాశం ఉంటుందన్నారు. అందుకు పాలకవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానించడానికి ఆమోదం తెలిపారు. అనంతరం సత్యసాయి జన్మదిన వేడుకల ఏర్పాట్లపై చర్చించారు. కౌన్సిలర్లకు మౌలిక సదుపాయాల కల్పనలో బాధ్యతలు అప్పగించారు. ఈ సమావేశంలో కమిషనర్ వెంకటరామిరెడ్డి, సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, ఎఇ స్వాతి, వైస్ చైర్మన్లు శ్రీలక్ష్మీ నారాయణ రెడ్డి, తిప్పన్న, కౌన్సిలర్లు సాయి గీత, సూర్య గౌడ్, లక్ష్మీపతి, చెరువు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఏర్పాటుకు సహకరించండి

ప్రజాశక్తి - లేపాక్షి

స్థానిక శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ హిందూపురం నియోజకవర్గ పర్యటనలో భాగంగా గలిబి పల్లి గ్రామస్తుల విన్నపం మేరకు గ్రామానికి తారు రోడ్డు వేస్తానని హామీ ఇచ్చారు. ఆయన ఇచ్చిన హామీ మేరకు రోడ్డు ఏర్పాటుకు అందరూ సహకరించాలని టిడిపి నాయకులు కోరారు. ఈమేరకు వారు శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. నియోజవర్గంలోని మూడు మండలాలకు కలిపి తారు రోడ్డు లేని గ్రామాలకు 2018 -19 సంవత్సరంలో సుమారు రూ.50 కోట్ల నిధులను తీసుకువచ్చారన్నారు. అయితే సమయంలో ఎన్నికలు వచ్చి వైసిపి అధికారంలోకి వచ్చిందనాక్నరు.ఈ ప్రభుత్వం కొత్తగా నిబంధనలు తీసుకువచ్చి 25శాతం టెండర్లను వెనక్కి తీసుకోవడం వలన రోడ్డు నిర్మాణాలు ఆగిపోయాయన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని రాజ్యసభ సభ్యులు కనకిమేడల రవీంద్ర కుమార్‌కు చెందిన రూ. 35 లక్షలు నిధులను సగంలో నిలిచిపోయిన గలిపి పల్లి రోడ్డు నిర్మాణానికి కేటాయించారన్నారు. అయితే ఆ నిధులతో రోడ్డు నిర్మించడానికి వీల్లేదని గతంలో కేటాయించిన నిధులతోనే రోడ్డు ఏర్పాటు చేస్తామని అధికారులు పొంతన లేని సమాధానాలు చెప్పడం సరికాదన్నారు. రోడ్డు ఏర్పాటుకు సహకరించకపోతే టిడిపి ఆధ్వర్యంలో గ్రామస్తులను కలుపుకుని కలెక్టరేట్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈసమావేశంలో టిడిపి మండల కన్వీనర్ జయప్ప, మాజీ ఎంపీపీ ఆనంద్, సీటీ ఆంజనేయులు, గంగిరెడ్డి, సదశివారెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ సత్యసాయి జిల్లా అధ్యక్షులు వెంకటాపురం అభి, బీసీ సెల్ మండల అధ్యక్షులు రవి, మైనారిటీ మండల అధ్యక్షులు షేక్షావలి, అంజి, మాజీ ఎంపీటీసీ శ్రీరామప్ప,నరసన్న,దవుద్ బాషా తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న సాగురైతులు, నాయకులు

సాగు భూముల పరిశీలన

రొద్దం : మండలంలోని కోగిర ,శాపురం, కంబాలపల్లి, రైతులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములను అధికారులు శుక్రవారం పరిశీలించారు. తహశీల్దార్ అనంతచారి, మండల సర్వేయర్ మైనుద్దీన్, ఎస్ఐ నాగస్వామి తదితరులు ఆయా గ్రామాల్లో పర్యటించారు. రైతులు సాగు చేసుకుంటున్న భూములను పరిశీలించారు. భూ పంపిణీ కోసం ఉన్న అవకాశాలను చర్చించి న్యాయం చేస్తామని తెలపారు. సాగుదారులకు పట్టాలు ఇవ్వాలని గతంలో సిపిఎం నాయకులు రైతులతో కలసి ఆందోళన చేశారు. ఈనేపథ్యంలో స్పందించిన అధికారులు శుక్రవారం ఆయా గ్రామాల్లోని భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ రైతులు ఐక్య పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. ప్రస్తుత భూ పంపిణీలో సాగుదార్లకు న్యాయం చేయకపోతే అవసరమైతే న్యాయపోరాటానికి కూడా సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఫక్రుద్దీన్, కెవిపిఎస్ జిల్లా నాయకులు గంగాధర్, సాగుదారులు కిష్టప్ప, అంజనప్ప, నారాయణ, నరసింహప్ప, మారుతి, తదితరులతో పాటు 150 మంది రైతులు పాల్గొన్నారు.

మినీ లెదర్ పార్కు ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి మడకశిర

మడకశిర మండలం రేకులకుంట అనంతపురం గ్రామంలో ఏర్పాటు చేయనున్న మినీ లెదర్ పార్క్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పెనుగొండ సబ్ కలెక్టర్ కార్తిక్ శుక్రవారం పరిశీలించారు. గతంలో పరిశ్రమల స్థాపన కోసం 1600 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. అయితే ఇప్పటివరకు అక్కడ ఎలాంటి పరిశ్రమలు స్థాపించకపోవడంతో భూమి నిరుపయోగంగానే ఉంది. దీంతో కొన్ని నెలల క్రితం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మంత్రివర్గ సమావేశం లో సమీక్షించి పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆమోదించి పరిశ్రమల శాఖ మంత్రి కి ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా పెనుగొండ సబ్ కలెక్టర్ కార్తిక్, స్థానిక తహశీల్దార్ ఆనంద్ కుమార్ ఇతర అధికారులు స్థలాన్ని పరిశీలించి పరిశ్రమల స్థాపన తీసుకోవాల్సిన చర్యల గురించి సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ ఫణి కుమార్, ఆర్ఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



భూములను పరిశీలిస్తున్న అధికారులు

విగ్రహ ప్రతిష్ఠాపన

ఓబుల దేవర చెరువు : మండల పరిధిలో ఉన్న అల్లాపల్లి గ్రామపంచాయతీ పగడాల వారి పల్లి గ్రామంలో గంగ భవాని విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.కొమిరి రమేష్ అనురాధ దంపతులతో విగ్రహాన్ని దేవాలయానికి అందించారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని అర్చకులు సత్యనారాయణ , మహేశ్, పంచరత్న సురేష్ శర్మ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ పూజారి ఆంజనేయులు తెలిపారు ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వేమన విగ్రహం తొలగించడం సిగ్గుచేటు

తనకల్లు : యోగి వేమన యూనివర్సిటీలో గల వేమన విగ్రహం తొలగించడం సిగ్గుచేటని టిడిపి మండల కన్వీనర్ రెడ్డిశేఖర్ రెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్ విమర్శించారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాకవి యోగి వేమన విగ్రహాన్ని తొలగించడం ఎంతవరకు సబబు అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.కవులకు, గొప్ప నాయకులకు మనం ఇచ్చే గౌరవం ఇదేనా అని అన్నారు. రానున్న రోజుల్లో వైసిపి ప్రభుత్వానికి పతనం తప్పదని అన్నారు.

యూనియన్ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం

తలుపుల : మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ శాఖ మేనేజర్ చందన్ కుమార్, బ్యాంక్ సిబ్బంది ఖాతాదారుల సమక్షంలో యూనియన్ బ్యాంక్ 104 వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ చందన్ కుమార్ మాట్లాడుతూ బ్యాంకు అభివృద్ధిని వివరించారు.కార్యక్రమంలో సబ్ మేనేజర్ షేక్ మన్సూర్, ఫీల్డ్ ఆఫీసర్ నిఖిల్, విశ్వనాథరెడ్డి, చోటు, బాబా, బ్యాంకు సిబ్బంది తదితరులు ఉన్నారు.

అవినీతి, అక్రమాలపై విచారణ

కొత్తచెరువు : కొత్తచెరువు మేజర్ పంచాయతీ కార్యాలయంలో గతంలో కార్యదర్శిగా పనిచేసిన నాగమణి మీద వచ్చిన అవినీతి అక్రమాలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ సీఈవో భాస్కర్ రెడ్డి శుక్రవారం విచారణ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అవినీతి సొమ్మును ప్రభుత్వ రికవరీ చేస్తుందని ఈసందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిద్ధారెడ్డి, పంచాయతీ కార్యదర్శి గోపాల్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

తనకల్లు : స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో శుక్రవారం సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు.ఉపాధి హామీ ప్రాజెక్టు డైరెక్టర్ రామాంజనేయులు, జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఎపిడి శ్రీనివాసరెడ్డి, ఎస్ఆర్‌పి మల్లికార్జున, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సామాజిక తనిఖీ ద్వారా నిర్వహించిన సర్వేలో మండల వ్యాప్తంగా దాదాపు 6278 రూపాయలు అవినీతి జరిగినట్లు నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పూల నరసింహులు, ఎంపీపీ ఎర్ర వీర కౌసల్య, ఏపీవో మరియమ్మ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

నంబులపూలకుంట : ప్రభుత్వ భూముల ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ రవినాయక్ హెచ్చరించారు. ఈసందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎలాంటి పత్రాలు లేకుండా ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో ప్రభుత్వ భూములకు హద్దులు ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

మండల పాత్రికేయుల కమిటీ ఏర్పాటు

మడకశిర రూరల్ : పాత్రికేయుల మండల కమిటిని శుక్రవారం ఎన్నుకున్నారు. పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ వసతి గృహంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలను చర్చించారు. అనంతరం మడకశిర మండల కమిటిని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తిమ్మారెడ్డి, గౌరవాధ్యక్షులుగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా హనుమంతరాయప్ప, కోశాధికారిగా నాగరాజు, సెక్రటరీగా హరిప్రసాద్, జాయింట్ సెక్రెటరీగా చంద్రశేఖర్ రెడ్డిని ఎన్నుకున్నారు. అదేవిధంగా ప్రెస్ క్లబ్ కమిటీ అధ్యక్షులుగా వేణుగోపాల్, గౌరవాధ్యక్షులుగా విశ్వనాథరెడ్డి, ఉపాధ్యక్షులుగా త్రిలోకనాథ్, కోశాధికారిగా కృష్ణారెడ్డి, సెక్రటరీగా నాగేష్, జాయింట్ సెక్రటరీగా ఆంజనేయులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కలిసికట్టుగా జర్నలిస్టుల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సమావేశంలో తీర్మానించారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

ధర్మవరం టౌన్ : ప్రజాసమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. పట్టణంలోని 16వవార్డులో శుక్రవారం నిర్వహించిన గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఛైర్మన్ లింగం నిర్మల, వైస్ ఛైర్మన్లు భాగ్యలక్ష్మి, పెనుజూరు నాగరాజు, వార్డు కౌన్సిలర్ కేతా లోకేష్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి : సిపిఎం

పెనుకొండ : పట్టణంలో ట్రాఫిక్ సమస్యను నియంత్రించి రోడ్డు ప్రమాదాలు అరికట్టాలని సిపిఎం నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక సిఐ కార్యాలయం వద్ద సిఐ కరుణాకర్‌కు వినతి పత్రం సమర్పించారు. కియా పరిశ్రమ కు సంబంధించిన బస్సులు, ప్రైవేట్ బస్సులు పట్టణంలో ప్రధాన రహదారి పక్కన, మధ్యలో నిలపడం వల్ల నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మహిళలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు హరి, సిపిఎం మండల కార్యదర్శి రమేష్, రాజగోపాల్, బాలస్వామి, చాంద్‌బాషా, శ్రీకాంత్, వజ్రం నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సత్యసాయి డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

పెనుకొండ : శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ పరిధిలో ఎస్-ఎస్‌బిఎన్ కళాశాలలో నిర్వహించిన గేమ్స్ అండ్ స్పోర్ట్స్ సాఫ్ట్ బాల్‌గేమ్ లో కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన లోకేష్, అశోక్, ఆరిఫ్, సాయి కిరణ్, దినేష్ గెలుపొందారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎస్‌బిఐఎస్ ఛైర్మన్ పల్లె కిషోర్, కళాశాల ప్రిన్సిపల్ మహేష్, ఫిజికల్ డైరెక్టర్ మారుతి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం

పెనుకొండ రూరల్ : పట్టణంలో మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ ఆవరణంలో నిర్మించిన కాంప్లెక్స్ భవనాలను ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ శుక్రవారం ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఎంపీపీ 15వ ఆర్థిక సంఘం సాధారణ నిధులతో 54 లక్షల రూపాయలతో భవనాలను నిర్మించారు. కాగా మరో రూ.50 లక్షలతో నిర్మించనున్న కాంప్లెక్స్ భవనాలకు ఎమ్మెల్యే శుక్రవారం భూమి పూజ చేశారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ గుట్టూరు శ్రీరాములు, ఎంపీడీవో శివశంకరప్ప, వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, నాగలూరు బాబు, శ్రీకాంత్ రెడ్డి, జయశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

తాడిమర్రి : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ పాటిల్ భువనేశ్వర్ రెడ్డి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎంపిడి మాట్లాడుతూ 2023 -24 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనులను గుర్తించాలన్నారు. ముఖ్యంగా వ్యవసాయపొలాలకు వెళ్లే దారులను గుర్తించి బాగు చేయాలన్నారు. అలాగే ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులను గుర్తించి హార్టికల్చర్ పనులకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎపీవో విజయలక్ష్మి, ఇఒఆర్‌డి కామాక్షి, పంచాయతీ కార్యదర్శులు,ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కనకదాసు సేవలు ఆదర్శనీయం



కనకదాసు చిత్రపటానికి కలెక్టర్ నివాళి

పుట్టపర్తిఅర్బన్ : కనకదాసు సమాజానికి అందించిన సేవలు ఎనలేనివని జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ కొనియాడారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనకదాసు హరిదాసుగా తన కీర్తనలతో సమాజంలో చైతన్యం తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, డిఆర్ఒ కొండయ్య, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ మాధవప్ప, ఎంపీపీ ఎవి రమణారెడ్డి, బీసీ కార్పొరేషన్ అధికారి నిర్మల జ్యోతి, సాంఘిక సంక్షేమ జిల్లా అధికారి శివరంగ ప్రసాద్, ఎస్టీ సంక్షేమ అధికారి మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు. అలాగే కురుబ సంఘం నాయకులు సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో కనకదాసు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో జరిగిన సమావేశంలో ఆ సంఘం నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కురుబ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బుల్లె ఆదినారాయణ, ఉమ్మడి జిల్లాల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు రవి, కృష్ణప్ప, శివ, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్ : పట్టణంలో శుక్రవారం శ్రీ కనకదాస జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు హిందూపురం పార్లమెంట్ సభ్యులు గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే మాలకొండ శంకర్ నారాయణ, వైసిపి నాయకులు, కురువ సంఘం నాయకులు కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మడకశిర : మడకశిర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కనక దాసు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కానక దాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, జిల్లా లీగల్ సెల్ సెక్రెటరీ అడ్వకేట్ రాధాకృష్ణ, జిల్లా కురుబ సాధికార అధ్యక్షులు అడ్వకేట్ గోవిందప్ప, కన్వీనర్ మద్దనకుంటప్ప, సర్పంచి నాగరాజు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ, యువ నాయకులు రంగేగౌడ, నజీర్, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ పట్టణంలోని మిట్ట ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద కనకదాస విగ్రహానికి టీడీపీ రాయలసీమ జోనల్ ఇన్‌ఛార్జి అమర్నాథ్ రెడ్డి ,మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి,జిల్లా ఇంచార్జ్ బిటి. నాయుడు, జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి,జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పూల నాగరాజు, అబ్జర్వర్లు దేవర నారాయణ రెడ్డి, నరసింహులు యాదవ్, కురుబ కష్ణమూర్తి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు.అదేవిధంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి,రాష్ట్ర కురుబ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ సవితమ్మ కనకదాసు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలను వెంటనే చెల్లించండి

ప్రజాశక్తి - తాడిమర్రి

తమకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు కార్మిక అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో సత్యసాయి వాటర్ సప్లై కార్మికులు స్థానిక పంప్ హౌస్ వద్ద 15 రోజులుగా ధర్నా చేస్తున్నారు. శుక్రవారం నిర్వహించిన ఆందోళనలో నాయకులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వాలన్నారు. ఈ మేరకు వారు స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఓబులేసు, సుధాకర్, రామకృష్ణ, తిరుపాలు, ఆచారి రవికుమార్, లక్ష్మి రెడ్డి, లక్ష్మీనారాయణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పైపులైన్ లీకేజీ

బత్తలపల్లి : మండలంలోని వెంకటగారిపల్లి గ్రామంలో పంచాయతీ పైపులైన్ పగిలిపోయి నీరు వృథా అవుతోంది. గ్రామంలోని పంచాయతీ స్కీం బోరు నుంచి గ్రామంలోని సరఫరా అయ్యే పైపులైన్ నాసిరకంగా ఉండడంతో పైపులు ధ్వంసమై నీరు వృథా అవుతోంది. పైపులైన్ పగిలిపోవడంతో నీరంతా ప్రధాన రహదారిపై వెలుతోంది. అధికారులు స్పందించి పగిలిపోయిన పైపులైన్‌ను మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మన భారతం భిన్నత్వంలో ఏకత్వం

ప్రజాశక్తి-హిందూపురం



కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు, తదితరులు

భిన్నత్వంలో ఏకత్వమే మన భారత దేశమని.... దేశంలో ఎన్నో మతాలు, ఎన్నో ఆచార వ్యవహారాలు ఉన్నప్పటికీ అందరూ కలిసి మూడు రంగుల జెండాయే మన జాతీయ పతాకం అని గొప్పగా చెప్పుకునే గొప్ప సంస్కృతి మనలో ఉందని పాంచజన్య శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పాంచజన్య బ్రిలియంట్స్ హై స్కూల్ లో జాతీయ సమైక్యత సద్భావన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేశంలో వివిధ మతాల ఆచార వ్యవహారాలతో పాటు సంస్కృతి, నాగరికత, వారు కొలిచే ఆలయాలు, మతాచారాలకు సంబంధించిన నమూనాలను తయారుచేసి ప్రదర్శించారు. ఈసందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక నృత్యాలు, దేశాన్ని సరిహద్దుల్లో ఉండి కాపాడుతున్న భారత జవానుల దినచర్యలపై చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నందకుమార్, అకాడమిక్ డైరెక్టర్ స్మిత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ నందిత, ఎఒ భాస్కర్, హెచ్ఎం గాయత్రి, ఎహెచ్ఎంలు విజయేంద్ర, శశికళ, ఉపాధ్యాయులు సతీష్ కుమార్, నిర్మల, నాగజ్యోతి, ఫరీదా, శశికళ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టిడిపికి పూర్వ వైభవం

పెనుకొండ : రాష్ట్రంలో టిడిపికి పూర్వవైభవం వస్తుందనిమాజీ మంత్రి, రాయలసీమ జోనల్ ఇన్‌ఛార్జి అమర్ నాథ్ రెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద మడకశిర నియోజకవర్గంలోని ఐదు మండలాలు, మడకశిర టౌన్ కమిటీ కి సంబంధించిన ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బి. కె. పార్థసారథి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి అమర్నాథ్ రెడ్డితో పాటు జిల్లా ఇన్‌ఛార్జి బిటి. నాయుడు,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ,మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ జెడ్పీ ఛైర్మన్ పూలనాగరాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి,మాజీ ఎమ్మెల్యే ఈరన్న, జిల్లా ప్రధానకార్యదర్శి అంబికాలక్ష్మీనారాయణ,ఎన్నికల పరిశీలకులు దేవర నారాయణ రెడ్డి, నాగేశ్వరయాదవ్, నరసింహ యాదవ్, వైకుంఠ మల్లికార్జున చౌదరి, తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి అమర్ నాథ్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే రాయలసీమ జోనల్ పరిధిలోని జిల్లాలలో కమిటీలను పూర్తి చేయడం జరిగిందని త్వరలోనే వందశాతం పూర్తిచేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మడకశిర నియోజకవర్గం లోని మండలాలకు చెందిన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టిన జగనన్న కాలనీలలో గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి సమీపంలో గల జగనన్న కాలనీనిసందర్శించారు కాలనీలో మౌలిక వసతులను వెంటనే కల్పించాలని, వివిధ దశలలో ఆగిన పనులను గుర్తించి వెంటనే పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారుల ఆదేశించారు. ఈసందర్భంగా కాలనీలో మహబూబ్ బాషా అనే లబ్ధిదారుని ఇంటిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి, వైస్ ఛైర్మన్ తిప్పన్న, మండల కన్వీనర్ రంగారెడ్డి, వైసిపి నాయకులు పార్థసారథి రెడ్డి, భాస్కర్ రెడ్డి, నారాయణరెడ్డి మాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పక్కాగృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

టిడిపి హయాంలోనే ముస్లిం మైనార్టీల అభివృద్ధి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలోనే ముస్లిం మైనార్టీల అభివృద్ధి జరిగిందని మైనార్టీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో తెలుగుమహిళ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సాహెబ్బీ, టీడీపీ మైనార్టీ సత్యసాయి జిల్లా ప్రధానకార్యదర్శి నాగూర్ హుస్సేన్ , నియోజకవర్గ అధ్యక్షుడు అత్తర్‌రహీం మాట్లాడారు. తొలివిద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ జయంతి సం దర్భంగా ముస్లిం మైనార్టీ డేను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఈ మైనార్టీడేను నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏ ఘనకార్యం చేసిందని విమర్శించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక టీడీపీ హయాంలో వస్తున్న సంక్షేమపథకాలన్నీ రద్దుచేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఉస్మాన్, షేక్షావలి, రావులచెరువు కుళ్లాయప్ప, బాబా ఫకృద్దీన్, మహబూబ్‌బాషా, బాబావలి, ఖాజా, నవీరసూల్. ఇమ్రాన్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో కూలీ మృతి

ధర్మవరం టౌన్ : పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారంపై శుక్రవారం ఒక కూలీ అనారోగ్యంతో మృతిచెందినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. కర్నాటకలోనిబెల్గాం జిల్లా గోకాడు. తాలూకా కౌలు జల్కి గ్రామానికి చెందిన ఆర్.కాశీం సాట్ వాలేఖర్(72) కుటుం బసభ్యులతో కలిసి ఈత పరకలవ్యాపారం చేసుకుంటూ ధర్మవరంలో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే కాశీంసాట్ వాలేఖర్ అనారోగ్యంతో ఉండటంతో కర్నాటకకు వెళ్లాలని రైల్వేస్టేషను చేరుకున్నాడు. అక్కడ జ్వరం అధికమై మృతి చెందినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వేపోలీసులు తెలిపారు.

వాహనాల వేలం

తనకల్లు : వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను మండల పరిధిలోని పరాకువాండ్లపల్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఒక కారు, మూడు ఆటోలు, 11 ద్విచక్ర వాహనాలను వేలం వేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే సుమారు ఎక్కువ ఆదాయం ప్రభుత్వానికి సమకూరినట్లు రవికుమార్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ జయనాథ్ రెడ్డి, ఎక్సైజ్ పోలీసులు, వేలంపాట దారులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కొత్తచెరువు : కొత్త చెరువులో ఇటీవల కమ్మపాలెం కు చెందిన టిడిపి నాయకులు ఈ చౌదరి, పత్తిపాటి సంజీవప్ప అనారోగ్యంతో మృతిచెందారు. వీరి కుటుంబాలను మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, నాయకులు శివ ప్రసాద్, ఎస్ వంశీకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతర ఉద్యమాలు : ఎస్‌ఎఫ్ఐ

హిందూపురం : విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతర ఉద్యమాలు చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి అన్నారు. భారత విద్యార్థి సమాఖ్య సభ్యత్వ నమోదు కార్యక్రమానికి పట్టణంలోని కళాశాల, పాఠశాలల్లో నిర్వహించారు. శుక్రవారం బాలయేసు కళాశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు జయచంద్ర, హర్ష కుమార్, భగత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో అన్నమయ్య సంకీర్తనలు

ధర్మవరం టౌన్ : శ్రీవారి సన్నిధిలో ధర్మవరానికి చెందిన అన్నమయ్య సేవామండలి అధ్యక్షులు పోరాళ్లపుల్లయ్య ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తనలు గావించారు. శుక్రవారం తిరుమలలో శ్రీవారిసన్నిధిలో పోరాళ్ల పుల్లయ్యబృంద సభ్యులు చామంతి గోవిందరాజులు, కలవలమురళి, బోడగలశంకర్, రవీంద్రారెడ్డి, పామిశెట్టినాగార్జున, మారుతి, నరేంద్ర, పోతిరెడ్డి సంకీర్త నలు ఆలపించారు.

ఆలయాలకు గ్రానైట్ వితరణ

కదిరి టౌన్ : ప్రజా సేవలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరి ప్రసాద్ కుటుంబం తన వంతు సహాయ సహకారాలు అందజేస్తోంది. అందులో భాగంగా నంబుల పూలకుంట మండలం మేకల చెరువు గ్రామ పంచాయతీ కటకం వారి పల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వెంకటేశ్వర స్వామి రేణుక ఎల్లమ్మ ఆలయాలకు వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరి ప్రసాద్ తన వంతుగా ఏడు చదరాల గ్రానైట్‌ను సమకూర్చారు. దీంతో గ్రామస్తులు బత్తల కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

హిందూపురం : పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుద్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎఐయుటియుసి రాష్ట్ర ఇన్‌ఛార్జి సుధీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని అల్ హి లాల్ పాఠశాల ఆవరణంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుద్య కార్మికులు పాల్గొన్నిర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో సుధీర్ మాట్లాడుతు గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుద్య కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కీర్తి, రమేష్, నారాయణప్ప, పారిశుద్య కార్మిక సంఘం నాయకులు అశ్వర్థప్ప, నాగప్ప, శివప్ప, జయ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ హాకీ లీగ్ పోటీల్లో ధర్మవరం జట్టు విజేత

ధర్మవరం టౌన్ : ఆర్డీటీ హాకీ లీగ్ పోటీల్లో ధర్మవరం జట్టు విజేతగా నిలిచిం దని పీడీలు రఘునాథరావు, ఓబుళేశు, నగేష్ తెలిపారు. ధర్మవరం ఆర్డీటీ క్రీడామైదానంలో శుక్రవారం అండర్-11 హాకీ బాలుర పోటీలను ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో ధర్మవరం ఆర్డీటీచగొట్లూరు, పుట్టపర్తి, కుంటిమద్ది, కొత్తచెరువు జట్లమధ్య పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ధర్మవరం జట్టు విజేతగా నిలవగా గొట్లూరు జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. ధర్మవరం క్రీడాకారుడు పనకుమార్ బెస్ట్ ప్లేయర్‌గా అవార్డు దక్కించుకున్నారు. దీంతో విజేతలుగా నిలిచిన జట్లకు ఆర్డీటీ కోఆర్డినేటర్ ఓబుళేశు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ హాకీకోచ్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా అబుల్ కలాం ఆజాద్ జయంతి

పుట్టపర్తి రూరల్: భారతరత్న, భారత దేశ మొదటి కేంద్ర విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అదనపు ఎస్పీ కెవి రామకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఎ అడ్మిన్ ఆర్ఐ టైటాష్, హోంగార్డు ఆర్ఐ శ్రీశైలం రెడ్డి. ఎఆర్ఐ సిబ్బంది, ఎస్పీ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : శ్రీ కృష్ణదేవరాయ జూనియర్ కళాశాల, ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాలలు సంయుక్తంగా శుక్రవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాయి. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ని పురస్కరించుకుని జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒలు ఆజాద్, రఘునాథ్ రెడ్డి, వీరాంజనేయులు, కళాశాల అధ్యాపకులు జునీడ్, రవి, శంకర్, లక్ష్మీనారాయణ, లక్ష్మీ, విద్యార్థులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా అబుల్‌కలాం ఆజాద్ జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలోరోటరీ క్లబ్ సభ్యులు. డాక్టర్ ఇస్మాయిల్ ఆజాద్, తాహేర్‌వలి, ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్ అలీ, జయరాములు, చిన్నప్పయ్య, గంగాధర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లోని పలు విద్యాసంస్థల్లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జాతీయ విద్యార్థి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుబ్బయ్య, సుజాత, రామకృష్ణ, ఉపాధ్యాయులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : విద్యా వ్యవస్థలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన వ్యక్తి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని నేటి విద్యార్థి లోకం ఆయన అడుగుజాడల్లో నడవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మయ్య తెలిపారు. ఆజాద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు దస్తగిరి, చంద్రమోహన్, ఓబయ్య, వెంకటకృష్ణయ్య, రాజశేఖర్, ఆనంద్, రామాంజనేయులు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : విద్యారంగానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు మరువలేనివని గ్రంథాలయ అధికారి జయరాం హెచ్ఎం చిన్నకృష్ణారెడ్డి అన్నారు. ఆజాద్ జయంతి సందర్భంగా శాఖా గ్రంథాలయంలోనూ, ఉన్నత పాఠశాలలో ఆజాద్ చిత్రపటానికి పూలమానులు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

హిందూపురం : మౌలానా అబుల్ కలాం అజాద్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మురళీమోహన్ అన్నారు. ఆజాద్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలో పలు పాఠశాల, కళాశాలలతో పాటు ముస్లీం నగరా ఆధ్వర్యంలో, టిడిపి మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను శుక్రవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, ముస్లీం నగరా సభ్యులు, టిడిపి మైనార్టీ విభాగం నాయకులు పాల్గొన్నారు.

సకాలంలో రైతులకు విత్తన కాయలు

కొత్తచెరువు : రైతు భరోసా కేంద్రాల నుండి రైతులకు సబ్సిడీతో విత్తనకాయలు, మందులు పంపిణీ చేయాలని జిల్లా అగ్రి అడ్వైజర్ బోర్డ్ చైర్మన్ రమణారెడ్డి తెలిపారు కొత్తచెరువులోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రైతు భరోసా పిఎం కిసాన్ ఇంకా ఎవరైనా వేలిముద్రలు వేయని వారు ఉంటే వారితో వేయించాలని సిబ్బందికి సూచించారు అలాగే పంట నమోదు చేసిన రైతులవి ఆన్లైన్ చేసి వారి వద్ద నుండి వేలిముద్రలు సేకరించాలన్నారు. పొలాల దగ్గర విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నందున ఎక్కడైనా విద్యుత్ లైన్ లో ప్రమాదకరంగా ఉంటే వాటిని తక్షణమే మరమ్మతులు చేయించాలని సూచించారు. పశువులకు సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నందున పశువైద్యసిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి వైద్య చికిత్సలు అందించాలని సూచించారు ఈ కార్యక్రమంలో అగ్రి అడ్వైజర్ మండల చైర్మన్ ప్రమీల శ్యాంసుందర్ రెడ్డి, వెటర్నరీ ఎడి పాటిల్ మల్లేష్ గౌడ్, వ్యవసాయ అధికారి నటరాజు, విద్యుత్ ఎఇ వెంకటేష్, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు

గొప్పలకే జగనన్న కాలనీలు : జనసేన

పుట్టపర్తి రూరల్ : నిరుపేదల కోసం జగనన్న కాలనీలు నిర్మాణం చేపట్టామని గొప్పలు చెబుతున్నరే తప్ప క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అవి వైసిపి నాయకులకు కార్యకర్తలకు ఎమ్మెల్యే అనుచరులకు మాత్రమే కేటాయించి నిర్మాణాలు చేపడుతున్నారని జనసేన నాయకులు ఆరోపించారు. స్థానిక సాయి ఆరామంలో ఆపార్టీ నాయకుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్, హిందూపురం ఇన్‌ఛార్జి ఆకుల ఉమేష్ , కదిరి ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్, జిల్లా అధికార ప్రతినిధి నిమ్మకాయల రాము, పుట్టపర్తి పట్టణ అధ్యక్షులు బొగ్గరం శ్రీనివాసులు హాజరై ప్రసంగించారు. జగనన్న ఇల్లు ప్రజలందరికీ కన్నీళ్లు అనే కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో మూడు రోజులు పాటు నిరసనలు తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తలారి పెద్దన్న, పూల శివప్రసాద్, మేకల ఈశ్వర్, అల్లాడి జయరాం, జిల్లా కార్యక్రమాల సభ్యులు సతీష్, ఐటి విభాగం జిల్లా వలస శ్యాంసుందర్, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.